సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను గంజాయి కేసులో ఇరికించారు

మా బిడ్డను కాపాడండి

ఎస్‌పికి తల్లిదండ్రుల మొర

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఏ తప్పు చేయని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై గంజాయి కేసు పెట్టి రిమాండ్‌కు పంపారని, పుత్తూరు పోలీసుల నుంచి తన బిడ్డను కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వాస్తవానికి వైసిపి మద్దతుదారు ఎఫ్ఐఆర్‌లో ఉంటే ఆ పేరు బదులో తన కొడుకును రిమాండ్‌కు పంపారని మీడియా ఎదుట కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు అనంతపురం రేంజి డిఐజి అమ్మిరెడ్డికి, ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.

పుత్తూరు పట్టణంలో గంజాయి వ్యాపారం చేస్తూ పట్టుబడిన వారిలో అధికార పార్టీ మద్దతుదారు డబ్బాల బాలుకు బదులు తన కొడుకు బాలవెంకట శివసాయిని కుట్రపూరితంగా పుత్తూరు పోలీసులు గంజాయి కేసులో ఇరికించి రిమాండ్ కు పంపారని తల్లిదండ్రులు డీఐజీ అమ్మిరెడ్డి తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డికి చెప్పుకుని బోరున విలపించారు. పుత్తూరు పట్టణానికి చెందిన నాగభూషణం, కల్పన అనే దంపతులు బుధవారం సాయంత్రం తిరుపతి పోలీస్ గెస్ట్ హౌస్ లో సిపిఎం పార్టీ నేత కందారపు మురళితో పాటు వెళ్లి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తమ కన్న కొడుకు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చేసి బెంగుళూరులో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా రిసోర్స్ ప్రో కంపెనీలో పనిచేస్తున్నారని వారు తెలిపారు. గతంలో ఏ నేర చరిత్ర తమ కుమారుడికి లేదని అన్యాయంగా పుత్తూరు పోలీసులు కేసులో ఇరికించి డబ్బాల బాబు ఎ8 నిందితునిగా ఉంటే తమ బిడ్డనే అలియాస్

డబ్బాల బాబుగా మార్చి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని తెలిపారు. సమాజంలో ప్రశాంత జీవనం గడుపుతూ ముగ్గురు అమ్మాయిలు, ఒక కుమారుడితో క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని గడుపుతున్న తమకు ఈ ఘటన షాకింగ్ గా ఉందని, గత వారం రోజులుగా ఇంటి బయటకు కూడా రాకుండా తీవ్రమైన వేదనతో కుమిలిపోతున్నామని విలపించారు. నేరం జరిగినట్టు ఎఫ్ఐఆర్లో పేర్కొన్న సమయంలో తమ కొడుకు బెంగుళూరులో డ్యూటీలో ఉన్నారని, దానికి సంబంధించిన పత్రాలు పోలీసుల అధికారులకు చూపారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిలు దంపతులైన నాగభూషణం, కల్పనల గోడును విన్నారు. తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. లోతుగా పరిశీలించి తక్షణం నివేదిక ఇవ్వాలని పుత్తూరు డిఎస్పి వై. శ్రీనివాసరావును ఆదేశించారు.

ఫ్లోటింగ్ సోలార్ మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

రామాపురం వద్ద గల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ లో మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ హరిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రామాపురం వద్ద మరమ్మత్తులకు గురైన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ (నీటి పైన తేలియాడే సోలార్ పలకలు) ను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో విద్యుత్ అవసరాల కోసం శ్రీకాళహస్తి సమీపంలోని రామాపురం రిజర్వాయర్ లో స్మార్ట్ సిటీ నిధులతో 4 మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ను నగరపాలక సంస్థ లో వినియోగిస్తున్నామని అన్నారు. ఈ ప్లాంట్‌లో 15330 సోలార్ పలకలు ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల గాలి, వాన వలన రిజర్వాయర్‌లో అలల తాకిడి ఎక్కువ కావడంతో నీటిపై తేలియాడే సోలార్ పలకలు మరమ్మత్తులకు గురయ్యాయని అన్నారు. 2800 పలకలు పాక్షికంగాను, 200 పలకలు పూర్తిగా మరమ్మత్తులకు గురయ్యాయని అన్నారు. ఆలస్యంగా పనులు జరుగుతున్నాయని, సిబ్బందిని ఎక్కువ మందిని పెట్టి త్వరగా మరమ్మత్తులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. అలాగే అలలను నిరోధించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం కే.పీ.కెనాల్ , రామాపురం వాటర్ పంపింగ్ కేంద్రాలను కమిషనర్ పరిశీలించి నీటి సరఫరాపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి. ఈ. మోహన్, ఎల్ అండ్ టి సంస్థ ప్రతినిదులు ఉన్నారు.

'అయ్యో'రికి లేదు చాక్‌'పీస్'

విద్యాశాఖలో గ్రాంట్లపై అస్పష్టత
పాఠశాలల నిర్వహణకు నిధుల లేమి
గత ఏడాదిలోనూ 80శాతం పెండింగ్

ప్రజాశక్తి - తిరుపతి

విద్యాశాఖలో గ్రాంట్ల గలాటా మొదలయ్యింది. బోధనకు అవసరమైన సామాగ్రి, గ్రంథాలయం, ప్రయోగశాల, స్టేషనరీ, విద్యుత్ బిల్లులు, పరీక్షల నిర్వహణ కోసం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా విడుదల చేసే నిధుల జాప్యంలో తీవ్ర అలసత్వం నెలకొంటోంది. గత రెండేళ్లుగా అరకొర నిధులతో సరిపెడుతున్న ప్రభుత్వంపై అయ్యోర్లలో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. గతేడాదిలో కేవలం 20 శాతం మాత్రమే విడుదల చేయడం, మిగిలిన 80 శాతం నిధుల విడుదలపై అస్పష్ఠత ఉండటం, ఈ ఏడాదికి ఏం చేయాలి బాబోయ్ అంటూ ప్రధాన ఉపాధ్యాయులు తలలు పట్టుకునే పరిస్థితి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెలకొంది.

సాధారణంగా స్కూల్ మెయింటినెన్స్ గ్రాంట్ విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. 1 నుంచి 30 వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలలకు పదివేల రూపాయలు, 30 నుంచి 100 మంది విద్యార్థులు ఉంటే 25 వేల రూపాయలు, 100 నుంచి 250 మంది విద్యార్థులు ఉంటే 50వేల రూపాయలు, 250 నుంచి 1000 మంది విద్యార్థులు ఉంటే 75 వేల రూపాయలు, ఆపైన విద్యార్థులు ఉంటే1 లక్ష రూపాయలు చొప్పన గ్రాంట్లను ప్రభుత్వం విడుదల చేయాలన్న నిబంధన ఉన్నట్లు తెలుస్తోంది. అయితే గత రెండేళ్ల కాలంలో పాఠశాల నిర్వహణకు అయ్యే నిధులను సమకూర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. గత ఏడాది జిల్లాకు కేవలం 20 శాతం నిధులు మాత్రమే వచ్చినట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. మిగిలిన 80శాతం నిధుల పైన ఇప్పటివరకు అస్పష్టత ఉందంటూ వాపోతున్నారు. ఇలా ఈ ఏడాది కూడా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రావాల్సిన 40 కోట్ల రూపాయల పైనా సందిగ్ధం నెలకొనడం, ఆ భారమంతా ప్రధాన ఉపాధ్యాయులపై పడుతోంది. దీంతో భారాన్ని తాము మోయలేమంటూ అయ్యోర్లు లబోదిబోమంటుడటం గమనార్హం.

అప్పుల బాధతో....

కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దపంజాణి: సాగుకోసం చేసిన అప్పు తీర్చలేక కౌలురైతు నరసింహులునాయుడు (59) ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపంజాణి మండలం అప్పినపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బాస్కర్‌నాయుడు కుమారుడు నరసింహులునాయుడుకు ఎకరా పొలం ఉంది. పక్కనున్న ఇద్దరు రైతుల భూములను మూడున్నర ఎకరా కౌలుకు తీసుకుని రెండేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. అయితే పంట పెట్టుబడులకు ప్రైవేట్ అప్పులు చేసి సాగుచేసినా గిట్టుబాటు ధరలు లేక, పెట్టుబడులు తడిచిమోపెడయ్యాయి. టమోటా, వేరుశనగ పంటలు వేసినా నష్టాలే మిగిలాయి. దీనికితోడు పాడెఆవు దూడ చనిపోవడంతో అప్పుచేసి కొన్న ఆవు పాలివ్వకుండా నష్టపోయాడు. ఈ నేపథ్యంలో ఆరేడు లక్షలు అప్పులు కట్టలేని పరిస్థితిలో మనోవేదనకు గురై బుధవారం తెల్లవారుజామున గ్రామానికి సమీపంలోని వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పెద్దపంజాణి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పోస్టుమార్టం కోసం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. భార్య సత్యవతి (55). వీరికి కుమారుడు మోహన్‌బాబు, కుమార్తె భవ్య ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు అయ్యాయి.

నేడు, రేపు సిఐటియు ప్రాంతీయ సమావేశాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఈనెల 6, 7 తేదీల్లో గురు, శుక్రవారం జరిగే ప్రాంతీయ సిఐటియు సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ సిఐటియు ట్రేడ్ యూనియన్ కింద 70 లక్షల మంది ఉద్యోగకార్మికులు ప్రాతినిధ్యం వహించే అతిపెద్ద కార్మిక సంస్థని, కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. అనేక పోరాటాల ఫలితంగా నిర్మించిన ప్రభుత్వరంగం ధ్వంసమవుతోందని, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించడాన్ని సిఐటియు వ్యతిరేకిస్తోందన్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి నాయకులు హాజరవుతారని తెలిపారు.

పిఎం ప్రాజెక్ట్ మానిటరింగ్ పోర్టల్ ప్రాజెక్టు అంశాలపై సమీక్ష

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ప్రధాన మంత్రి ప్రాజెక్ట్ మానిటరింగ్ పోర్టల్ నందు సూచించిన ప్రగతి అంశాలపై దష్టి పెట్టాలని ఆర్ అండ్ బి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ పి.ఎస్.ప్రద్యుమ్న సూచించారు. బుధవారం ఉదయం కేంద్ర కేబినేట్ సెక్రటరీ , ఆర్ అండ్ బి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ లకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి పాల్గొన్నారు. ఆర్ అండ్ బి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి, రైల్వేలకు భూసేకరణ , ఆటవీ అనుమతులు, ఎ పి ఐ ఐ సి భూముల వివరాలు, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల నిర్మాణాలు, జాతీయ రహదారుల వంటి వాటి పై పురోగతి వుండాలని సూచించారు. ఈ వర్చువల్ సమావేశంలో లాండ్ అక్విజేషన్ డి టి భాస్కర్ పాల్గొన్నారు.

హైరిస్క్ సిజేరియన్ ఆపరేషన్ సక్సెస్

50 ఏళ్ల వయసులో కవలలకు జన్మనిచ్చిన సిద్ధమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చిత్తూరు జిల్లా వరత్తూరు గ్రామానికి చెందిన సిద్ధమ్మ పిల్లల లేని కారణంగా తమిళనాడులో ఐవీఎఫ్ పథకం ద్వారా సంతాన ఉత్పత్తి కేంద్రం వారి సహాయంతో గర్భాన్ని దాల్చి సిజేరియన్ ఆపరేషన్ ద్వారా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చిందని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి డి.పార్థసారధి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పార్థసారధి రెడ్డి మాట్లాడుతూ గత నెల రెండో తేదీన సిద్ధమ్మ 8 నెలల గర్భవతిగా ప్రసూతి ఆసుపత్రిలో చేరిందన్నారు. ఆర్థిక భారంతో ప్రసూతి ఆసుపత్రికి వచ్చిన సిద్ధమ్మకు రక్తపోటు, రక్తహీనత ఉన్నాయని, కవలలు కడుపులో ఉన్నారని గుర్తించామన్నారు. హైరిస్క్ కేసుగా పరిగణించి సిద్ధమ్మకు రక్తపోటుకు మందులను అందిస్తూ రెండు బాగ్స్ రక్తం ఎక్కించి వైద్యం అందించామన్నారు. జూన్ 23న డాక్టర్ సునీత,

డాక్టర్ సంధ్య సిద్ధమ్మకు సిజేరియన్ ఆపరేషన్ చేసి 2.1, 2 కిలోల బరువు గల ఇద్దరు మగ కవలలకు కాన్పు చేశారన్నారు. మంగళవారం సిద్ధమ్మ సంపూర్ణ ఆరోగ్యంతో ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారని, ఇంతటి క్లిష్టమైన కేసును ఎంతో పర్యవేక్షణతో వైద్యం అందించిన వైద్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

పార్వేటి మండపం కూల్చివేతకు సిఐటియు ఖండన

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

శతాబ్దాల కిందటి చారిత్రక కట్టడం... తిరుమల ప్రజలతోనూ, భక్తులతోనూ పెంచుకున్న అనుబంధాన్ని టిటిడి అధికారులు కూలగొట్టారు. భక్తులు, ప్రజల మనోభావాలతో సంబంధం లేకుండా టీటీడీ వ్యవహరిస్తున్న తీరుకు మరో ఉదాహరణ ఈ కూల్చివేత. టిటిడి తీరును సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. శ్రీకష్ణదేవరాయలు హయాంలో శతాబ్దాల కిందట నిర్మించిన పార్వేటి మండపాన్ని టీటీడీ అధికారులు ఏకపక్షంగా కూల్చివేయటం అసమంజసమైన చర్యగా అభివర్ణించారు. అభివద్ధి కార్యక్రమాలకు అవసరమైన స్థలం ఉండగా, పార్వేటి మండపాన్ని కూలగొట్టడం ఏరకంగా సమర్థనీయమో టీటీడీ యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని టిటిడి యాజమాన్యం తేలిగ్గా తీసుకొని కూల్చివేయడం అన్యాయమన్నారు. తిరుమల కొండపై అన్నమయ్య నివాసం ఉన్న ఇంటిని ఆయన పూజలు చేసిన మండపాన్ని కూల్చివేసి టిటిడి అధికారులు తప్పు చేశారని, వాటి పునర్నిర్మాణం జరగాలని, పోరాటం జరుగుతున్న సమయంలో మరో అన్నమయ్య గురుతుని చెరిపి వేయడం దారుణమని అభిప్రాయపడ్డారు. తక్షణం టిటిడి యాజమాన్యం ఇలాంటి తప్పుడు వైఖరులను మానుకోవాలని ప్రస్తుత స్థానంలోనే పార్వేటి మండపాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు రాయలసీమా పోరాట సమితి కన్వీనర్ పి నవీన్‌కుమార్‌రెడ్డి టిటిడి తీరుపట్ల అభ్యతరం వ్యక్తం చేశారు. పార్వేటి మండపం కూల్చవద్దని కోరారు.

పునరుద్ధరిస్తున్నాం : టిటిడి

శిథిలావస్థకు చేరుకున్న పార్వేట మండపాన్ని పునరుద్ధరిస్తున్నాం తప్ప, మండపాన్ని కూల్చివేయడం లేదని టిటిడి ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఆ మండపాన్ని పునరుద్ధరిస్తున్నామని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో రూ.2.07 కోట్లతో జులై 4నుంచి జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించినట్లు పేర్కొంది.

తిరుమలలో 'ఆక్టోపస్' దళం మాక్ డ్రిల్

ప్రజాశక్తి - తిరుమల

అధునిక టెక్నాలజితో తిరుమలలో పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉందని, ఎలాంటి భద్రతాపరమైన సమస్యనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆక్టోపస్ అదనపు ఎస్పీ నగేష్ బాబు తెలిపారు. బుధవారం పిఎసి- 4లోని సమావేశ మందిరంలో తిరుమల అదనపు ఎస్పీ ముని రామయ్యతో కలిసి ఆయన ఆక్టోపస్, పోలీస్, ఫెర్, రెవెన్యూ, వైద్య, ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమలలో తరచుగా ఇటువంటి మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా భద్రత లోపాలను అధిగమించవచ్చున్నారు. సంఘ విద్రోహులు తిరుమలలోని ఏదైనా ప్రదేశంపై దాడి చేసినప్పుడు ఎలా తిప్పికొట్టి భక్తులకు రక్షణ కల్పించాలి అనేది ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ విధంగా తిరుమలలోని ఒక విశ్రాంతి గహంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆక్టోపస్ డిఎస్పి నరసింహారావు సంఘ విద్రోహ శక్తులను ఎదుర్కొనేటప్పుడు ఏ విభాగం ఏ కార్యక్రమాలు నిర్వహించాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో తిరుమల డిఎస్పి భాస్కర్ రెడ్డి, టీటీడీ విజీఓ గిరిధర్, ఏవీఎస్‌ఓలు సతీష్, గిరిధర్ పాల్గొన్నారు.

తిరుపతిలో డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరుస్తాం : డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని అన్ని ఏరియాల్లో దెబ్బతిన్న డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరుస్తామని తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ ఇందిరానగర్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను డివిజన్ కార్పొరేటర్ హనుమంత్ నాయక్, వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు ఐ.సి.ఎస్ రెడ్డి, డివిజన్ వైసిపి అధ్యక్షురాలు గంగులమ్మతో కలిసి భూమన అభినయ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి అభివద్ధికి తమ కార్పొరేటర్లు అంతా పూర్తి స్థాయిలో పని చేస్తున్నామని, నిరంతరం ఏరియాల్లో తిరుగుతూ ప్రజల సమస్యలని అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కషి చేస్తున్నామన్నారు. ఇందిరానగర్ సెంటర్లో నిత్యం మందుబాబులు, ఆకతాయిలతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని భూమన అభినయ్ దష్టికి తీసుకురాగా, వెంటనే పోన్ ద్వారా వెస్ట్ పోలీస్ స్టేషన్ సి.ఐ తో మాట్లాడుతూ పోలీస్ ఫికెట్ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఈ రవీంద్ర రెడ్డి, డివిజన్ నాయకులు సునీల్ యాదవ్, రాజు, గౌరీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓను సత్కరించిన 'అప్సా' నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తిరుపతి మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కె.బాలాజిని బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వి. సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. మండల విద్యాశాఖ అధికారి-2 గా బాధ్యతలు చేపట్టిన భాస్కర్ నాయక్‌నూఅప్సా యూనియన్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అప్సా కోశాధికారి పి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

'మెడికేర్'లో హోల్‌సేల్ అండ్ రీటైల్ సేవలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని స్థానిక తిలక్ రోడ్డులో ఎస్.బి.బి సంస్థ వారి మెడికేర్ అను అతి పెద్ద హోల్ సేల్ అండ్ రిటైల్ మెడికల్ స్టోర్ బుధవారం నగర ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న వైద్య విధానంలో మార్పులకు తగ్గట్టుగా సదరు దుకాణాన్ని మంచి ప్రణాళికతో రూపొందించడం ఆనందదాయకమన్నారు. రోగులకు వైద్య సేవలు అందించడానికి ముందుకు వచ్చిన దుకాణ యజమాని కె.వి చౌదరిని అభినందించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ రోగులకు సేవలు అందించడంలో వైద్య రంగం ఎంత ముఖ్యమో, వారు తీసుకునే మందులు అంతే ముఖ్యమని, అటువంటి మందులు ఈ దుకాణంలో ఏర్పాటు చేయడం హర్షదాయకమన్నారు. నగర మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ అందరికీ చేరువలో, అతి తక్కువ ధరలకే ఈ మందుల దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.



నగరపాలక సంస్థ కమిషనర్ హరిత మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పెరుగుతున్న జనాభాను దష్టిలో ఉంచుకొని, సరసమైన ధరలలో నాణ్యమైన అన్ని రకాల మందులను నగర ప్రజలకు అందుబాటులో ఉంచడం శుభ పరిణామం అన్నారు. మెడికేర్ సంస్థ చైర్మన్ కె.వి చౌదరి మాట్లాడుతూ తాను ఒక సాధారణ ఇటుక వ్యాపార రంగం నుంచి హోటల్ నిర్వాహకుడిగా, బిల్డర్‌గా, రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఇలా పలు రంగాలలో నిత్యం నగర ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, మొట్టమొదటిసారిగా పేద రోగులకు అతి తక్కువ హోల్సేల్ ధరలలో మందులు అందించేందుకు వైద్యరంగంలో అడుగుపెట్టడం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. నగర ప్రజానీకానికి అందుబాటులో ఉండే విధంగా మెడికల్స్, సర్జికల్స్, పర్సనల్ కేర్, మామ్ అండ్ బేబీ కేర్, హెల్త్ కేర్, న్యూట్రిషన్, వెల్నెస్ వంటి అన్ని రకాల మందులు ఒకే చోట ఉపయోగపడే విధంగా ఈ మందుల దుకాణం ఏర్పాటు చేశామన్నారు. హోల్ సేల్ ధరలలో 20శాతం డిస్కౌంట్ తో ఫ్రీ హోం డెలివరీ సదుపాయం కూడా తమ దుకాణంలో అందుబాటులో ఉంటుందని, వాట్సప్ ద్వారా డాక్టర్ రాసిన ఉత్తర్వును పెడితే మందులను చేరవేస్తామని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయుర్ ఆరోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని పిలుపునిచ్చారు. నగర ప్రజలు ఎస్‌బిబి మెడికల్‌షాపులో మందులు తక్కువ ధరకే ఇస్తున్నామని తెలిపారు. మెడికల్‌స్టోర్ ప్రారంభం సందర్భంగా వైసిపి నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, నైనారు శ్రీనివాస్, చాంబర్‌ఆఫ్ కామర్స్ నాయకులు పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో .. ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తిరుపతి నగర పరిధిలోని నరసింహతీర్థం రోడ్డు మార్గంలో గల ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు సిఏ ఇనిస్టిట్యూట్ విడుదల చేసిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచారని సంస్థ డైరెక్టర్లు ఇ. గిరిధర్ రెడ్డి, కె. విశ్వనాథరెడ్డి తెలిపారు. సీఏ ఫలితాల్లో పి.మనోహర్ 549, పి.భార్గవి 514, సి.నాగహిమశ్రీ 473 టాపర్లుగా నిలిచారన్నారు. ఈ ఫలితాల్లో 59.25 శాతం ఉత్తీర్ణతను సాధించామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఇందుకు దోహదపడ్డ అధ్యాపక బందాన్ని ప్రత్యేకంగా అభినందించామన్నారు.

ఆంధ్రా ఐపిఎల్‌కు క్రికెట్ స్టేడియంలు : మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామీణ క్రీడలను ప్రోత్సహించి, యువత ప్రతిభను వెలికి తీసి రాష్ట్ర, దేశ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రాష్ట్రంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలను ప్రారంభించనున్నారని రాష్ట్ర యువజన క్రీడలు ,సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రివర్యులు ఆర్‌కె రోజా చెప్పారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని ఆర్కే రోజా అన్నారు. చెన్నై ఐపిఎల్ లాగా ఆంధ్రా ఐపిఎల్ క్రీడాకారులను తయారు చేయడానికి విశాఖ, తిరుపతి, మంగళగిరి, రాజమండ్రి ప్రాంతాలో 20 ఎకరాలలో క్రికెట్ స్టేడియంలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. బుధవారం సాయత్రం స్థానిక గ్రాండ్ రిట్జ్ హోటల్ నందు యూత్ సర్వీసెస్ అండ్ స్పోర్ట్స్ ప్రిన్స్‌పల్ సెక్రటరీ వాణి మోహన్ , ఎం.డి.హర్ష వర్ధన్ , సెట్విన్ సిఇఓ మురళి కష్ణ , చీఫ్ కోచ్‌లతో పర్యాటక శాఖ మంత్రి ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణ పై సమీక్షించారు.

మంత్రివర్యులు మాట్లాడుతూ రాష్టమంతా ప్రతి సచివాలయ స్థాయిలో 17 సంవత్సరాల వయసు పైబడిన యువతకు క్రికెట్ , బాడ్మింటన్ , వాలీబాల్ , కబడ్డీ, ఖోఖో క్రీడల్లో అవకాశం కల్పించి అక్కడి నుండి మండల, అసెంబ్లీ , జిల్లా , రాష్ట్ర స్థాయిల్లో ఎంపిక జరిగి ప్రతిభ కనబరిచిన వారికి రూ. 12

కోట్లతో నగదు బహుమతులు ప్రథమ, ద్వితీయ , తతీయ స్థానాల్లో గెలుపొందిన క్రీడా కారులకు అందించనున్నామని తెలిపారు. ఆ మేరకు జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు కావాలని అన్నారు. మరో రూ.42 కోట్లతో క్రీడాకారులకు క్రీడా కిట్స్ అందించాలని అన్నారు. క్రీడల్లో పాల్గొనడానికి యువత కోసం ప్రత్యేక యాప్ తయారు చేసి నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. క్రీడల నిర్వహణకు ప్రభుత్వ పాఠశాలల క్రీడామైదానాలు సిద్ధం చేయాలని , ప్రభుత్వ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలన్నారు.

ఈ సమీక్షలో క్రీడల చీప్ కోచ్ లు బాలాజీ , సయ్యద్ సాహెబ్ ,వివిద క్రీడల కోచ్ లు , ఆర్కియాలజీ ఎడి శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఆడుదాం ఆంధ్రా క్రీడల పై మీడియా సమావేశం లో వివరించారు.

'జగనన్న సురక్ష'తో సమస్యలకు తక్షణ పరిష్కారం

డిప్యూటీ సిఎం నారాయణస్వామి

ఎస్ఆర్‌పురంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటి సిఎం

ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం: ప్రజల దగ్గరికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం చూపించే దిశగా చేస్తున్నా మరో వినూత్నంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమే ఈ జగనన్న సురక్ష అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం డిప్యూటీ సీఎం మండలంలో స్థానిక నాయకులతో కలిసి వివిపురం ఎస్ఆర్ పురం సచివాలయంలో జగనన్న సురక్ష పథకాన్ని ఎలా అమలు చేస్తున్నారని పర్యటించి పరిశీలించారు, ఆయన మాట్లాడుతూ సచివాలయాల దగ్గర నిర్వహించే క్యాంపుల్లో 11 సర్వీసులకు ఎటువంటి ఛార్జీలు ఉండవని, ప్రజలకు వారికి అవసరమైన ధ్రువపత్రాలను పొందవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కష్ణయ్య, తహశీల్దార్ లోకనాథ పిల్లా, మండల ప్రత్యేక అధికారి మెయిన్స్ డిడి.ప్రసాద్, జెడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, జనార్ధన్, సర్పంచులు హరిత కుప్పయ్య, లక్ష్మమ్మ దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

పెనుమూరు: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి చెప్పారు. బుధవారం కామచిన్నయ్యపల్లె గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జడ్పిటిసి సభ్యులు జి.దొరస్వామి యాదవ్, సింగల్ విండో అధ్యక్షులు కారేటి గోవిందరెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ కామసాని లోకేష్‌రెడ్డి, తహశీల్దార్ కళావతి పాల్గొన్నారు.

ఐరాల: కాణిపాకం సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఐరాల ఎంపిడిఓ నాగరాజ పాల్గొని ప్రజలకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం గోపిశెట్టిపల్లి, ఆశత్తూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను ఎంపీపీ లతబాలాజీ ప్రారంభించారు. అనంతరం ధరఖాస్తులు చేసుకున్న వారికి దవపత్రాలను అందించారు. సర్పంచ్‌లు చిన్న, సర్వేశ్వర్, ఎంపీటీసి మురగయ్య, సచివాలయ కన్వీనర్ పురందర్, ఎంపీడీవో మోహన మురళీ, తహసీల్దార్ రవికుమార్రాజు పాల్గొన్నారు.

ఐరాలలో..

కార్వేటినగరంలో..

సోమల: మండలం అన్నెమ్మగారిపల్లి పంచాయతీలోని ప్రజల సౌకర్యార్థం బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ప్రజల వద్ద నుండి 464 దరఖాస్తులు రాగా 150 మందికి అప్పటికప్పుడు కుల, ఆదాయ, రేషన్ కార్డులో మార్పులు చేర్పులు, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ సమస్యలను పరిష్కరించి ధ్రువపత్రాలను అందజేశారు. సర్పంచ్ వనజమ్మ, రమణారెడ్డి, ఎంపీడీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి లలిత, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

చౌడేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సురక్ష పథకం ఫలాలు అర్హులందరికీ అందిస్తామని తహశీల్దార్ మాధవరాజు, ఎంపీడీవో సుధాకర్ అన్నారు. సర్పంచ్ శ్రీరామ్ భరత్ వరుణ్ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం పరిధిలోని సురక్ష ఇంటింటి సర్వే చేసి సంబంధిత పత్రాలు అందించారు.

పెద్దపంజాణీ: అమ్మరాజుపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ స్వర్ణలత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా 598 పౌం సేవలకు గాను ధవీకరణ పత్రాలు మంజూరు చేసి లబ్దిదారులకు ఉచితంగా అందజేశారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎన్.రెడ్డెప్ప, జడ్పీటీసీ సభ్యులు సుష్మా కీర్తి బాగారెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస విశ్వనాథ్, బొమ్మరాజుపల్లి సర్పంచ్ శారద, నాయకులు అమరనాథ్ రెడ్డి, వైస్ ఎంపిపి జీడి బాబు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

యాదమరి: జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ హనుమంతు సూచించారు. బుధవారం 155 కమ్మపల్లి జగనన్న సురక్ష పత్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కమ్మపల్లి సర్పంచ్ తులసి రెడ్డి, ఎంపీడీవో శివరాజ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

యాదమరిలో..

'అల్లూరి' విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి రోజా

ప్రజాశక్తి- విజయపురం
అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి ఆర్కే రోజు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన విజయపురం కూడలిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బడుగు బలహీన వర్గాల కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఆయన యువతకు ఆదర్శప్రయుడన్నారు. అతి చిన్న వయసులోనే స్వతంత్రం కోసం బ్రిటిష్ వారితో పోరాటం చేసిన ఘనుడన్నారు. అనంతరం ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఆయన పోరాటం వలన జరిగిన జీవన విధానం దెబ్బ తినకుండా ముందుకు సాగుతున్నారు. అల్లూరి సీతారామరాజు మనవడు అల్లూరి రామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు ఆదర్శంగా తీసుకుంటుందన్నారు. అనంతరం మంత్రి ఆర్కే రోజని గజమాలతో సన్మానించారు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అడిషనల్ డిఎంహెచ్‌వో రవిరాజు, ఎంపిపి జమున, మండల అధ్యక్షులు గోపినాథ్, శేఖర్ రాజు, గుణశేఖర్ రెడ్డి, శివరాజు దీప్తగోపి, ప్రసాద్ రాజ్, హరికృష్ణ, సరస్వతి గోపిరాజు, కెవి రాజు చెంచు ప్రసాద్ పాల్గొన్నారు.

కుంభాభిషేక వేడుకల్లో మంత్రి

ప్రజాశక్తి- నగరి: మున్సిపల్ పరిధి కాకవేడు ఆదిఆంధ్రవాడలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయ అష్ఠబంధన మహాకుంభాభిషేక వేడుకలు బుధవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ ధీపాలతోను, పుష్పాలతోను సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల ఉచ్చరణలు ఆలయం వద్ద హోరెత్తాయి. ఈప్రాంతంలో మాతమ్మ ఆలయ నిర్మాణం కోసం దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. మంత్రి ఆర్కేరోజా స్థానికుల కోరిక మేరకు ప్రత్యేకచొరవ తీసుకొని టీటీడీ ద్వారా రూ.10లక్షల నిధులు మంజూరు చేయించడంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం జరిగింది. ఈ మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి ఆర్కేరోజా యాగశాల పూజల్లోను, యాత్రాదానం, మహాపూర్ణాహుతిలోను పాల్గొన్నారు. అనంతరం కలశ ప్రదక్షిణ చేసి గోపుర శిఖరంపైకి చేరుకొని శిఖరానికి అభిషేకం చేశారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, దేశమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, నాయకులు ఎన్‌సీ ఆనంద్‌కుమార్, కష్ణమూర్తి, ఎల్లప్పరెడ్డి, సలీం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ఆర్టిసిన్ సెల్ స్టేట్ కన్వీనర్ బంగారు బాబు

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండల కార్యాలయ సమీపంలోని అఖిల భారత విశ్వాఖర్మ కార్యాలయంలో జరిగిన మహాసభ బిజెపి రాష్ట్ర ఆర్టిసిన్ సెల్ స్టేట్ కన్వీనర్ బంగారు బాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా విశ్వకర్మ సభ్యులను పరిచయకార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ విశ్వకర్మ వంశానికి చెందిన చేతివత్తుల వారికీ కేంద్ర ప్రభుత్వం వారు అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తమ తమ చేతి వతులకు సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని లబ్ది చేకూరాలని పేర్కొన్నారు. బంగారు బాబును గజమాల, దుష్యాలవతో విశ్వాఖర్మ అధ్యక్షులు సుధాకర్, సభ్యులు మణికంఠ, కిరణ్, గిరి సత్కరించారు.

'దంపతుల మృతికి కారకుడు డిప్యూటీ సీఎం'

టిడిపి నాయకులు మోహన్ మురళి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని బలిజమొండి వెంగనపల్లె దంపతులు రోడ్డు ప్రమాదంలో మతి చెందడానికి డిప్యూటీ సీఎం కారణమని టిడిపి నాయకుడు, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్వేటినగరం వెదురుకుప్పం రోడ్డు వెడల్పు చేసి ఉంటే ఈ రోడ్డు ప్రమాదాలు జరిగేవి కావని అన్నారు. ఇరుకైన రోడ్లలో జనాలు అవస్థలు పడుతున్నారని తెలియజేశారు. ఇకనైనా డిప్యూటీ సీఎం స్పందించి రోడ్డు వెడల్పు చేసే పనులు చేయాలని కోరారు. పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు చంద్రబాబురెడ్డి, యూనిట్ ఇంచార్జ్ శ్రీరాములు రెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు బిఎం రవి, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు చేంజి వరప్రసాద్, శ్రీనివాసలురెడ్డి, వెంకటేష్ కోదం రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి హయాంలో విజయ డెయిరీ మూతపడలేదు..

టిడిపి మండలాధ్యక్షులు జయప్రకాష్ నాయుడు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: టిడిపి ప్రభుత్వంలో విజయ డెయిరీ మూతపడలేదని టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు అన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీ స్థలం ఎకరాలను లీజు పద్ధతిలో ఇవ్వడం చాలా దారుణమని, దాని విలువ దాదాపు రూ.200కోట్లు పైనే ఉంటుందని అటువంటి ఆస్తులను గుజరాత్ కంపెనీ అయిన అమూల్‌కు అప్పజెప్పడం వెనకాల గల రహస్యాలను తెలపాలని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లాలో పాడి రైతులు పాడి ద్వారా అధికంగా జీవనం సాగిస్తున్నారని అమూల్ వలన వారు ఇబ్బంది పడక తప్పదని అన్నారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, సుదర్శనం నాయుడు, ప్రకాష్ నాయుడు, రవి, రమేష్, జాకీర్ పాల్గొన్నారు.

'ఇలాంటి భోజనం నా చిన్నతనంలో దొరకలేదు '

పిల్లలతో కలిసి భోజనం చేసిన ఉపముఖ్యమంత్రి

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం: జగనన్న గోరుముద్దలతో చిన్నారులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యమవుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం మండలంలోని ఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ తాను చదువుకున్న రోజులలో తన చిన్నతనంలో ఇలాంటి భోజనం దొరికేది.. కాదని మా అమ్మ వరినాట్లు వేయడానికి వెళితే మధ్యాహ్నం సంగటి ముద్ద చేతిలో పెట్టుకుని మా అమ్మ నాకు మా చెల్లికి ఒక్కొక్క ముద్దలు తినిపించేదని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పిల్లలకు ఎంతో రుచికరంగా పెరుగుదలకు కావలసిన పోషకాలతో మెనూ సెలెక్ట్ చేసి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిత కుప్పయ్య, జెడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, జనార్ధన్, ఎంపీడీవో కష్ణయ్య, తహశీల్దార్ లోకనాథ పిల్లై, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ఎస్ఐపై చర్యలు తీసుకునే వరకూ నిరాహార దీక్ష'

ప్రజాశక్తి- గుడిపల్లి: కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలంలో ఎస్ఐ దళిత సోదరునిపై దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ బుధవారం కుప్పం అంబేద్కర్ ఎదుట నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ దళిత తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమనీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మండలానికి చెందిన మాజీ సర్పంచ్ మహాదేవి, జైశంకర్‌పై రామకుప్పం ఎస్సై కోర్టు ఆవరణలో దురుసుగా ప్రవర్తించి, కులం పేరుతో దూషించారని పై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలుమార్లు నిరసనలు, ర్యాలీలు నిర్వహించినా పట్టించుకోకపోవడంతో నేడు నిరాహారక్ష దీక్ష చేపట్టినట్లు తెలిపారు. దళితులను హీనంగా మాట్లాడిన ఎస్ఐపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. నాయకులు రాజ్‌కుమార్, మురుగేష్, రవినాయక్, కందస్వామి, గణపతి, దేవరాజు మాదిగ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ-1 శ్రీరాములు, ఎంఈఓ- 2 శివరత్నమ్మ తనిఖీలు నిర్వహించి మధ్యాహ్న భోజనాన్ని నాడు- నేడు అభివద్ధి పనులను పరిశీలించారు. ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను చివరత్నమ్మ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలను అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చెన్నయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలను శ్రీరాములు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు ఉపాధ్యాయుల హాజరు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

పలమనేరు: పట్టణంలోని కొత్తపేటలో ఉన్న ఎంపీపీ ఉర్దూ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారిని లీలారాణి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అకాడమిక్ స్టాండర్డ్, అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అలాగే మధ్యాహ్నం భోజనం, వంటగది ఆవరణం, పాఠశాలలోని నాడు- నేడు పనులను పరిశీలించి ఇంజనీరింగ్ విభాగం వారికి, పాఠశాల సిబ్బందికి వెంటనే త్వరగతిగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు మంచి బోధన అందించాలని ముఖ్యంగా అకాడమిక్ స్టాండర్డ్స్ వారి వారి స్థాయిలో బోధించాలని సూచనలు సలహాలు అందజేశారు.

ఎంఈఓగా కాణిపాకం ఆంజినేయులుశెట్టి

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: మండలం నూతన ఎంఈవోగా కాణిపాకం ఆంజినేయులు శెట్టి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకుముందు పుంగనూరు హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఎంఈఓగా గంగాధరనెల్లూరు మండలానికి వచ్చారు. గతంలో ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన రాజేంద్రన్ రెగ్యులర్ ఎంఈఓగా బంగారుపాళ్యం మండలానికి బదిలీపై వెళ్లారు.

ఆలయంలో శుభకార్యాల నిర్వహణకు అనుమతి

ప్రజాశక్తి-నగరి: తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధీనంలో ఉన్న స్థానిక భూదేవీ, శ్రీదేవీ సమేత శ్రీకరియమాణిక స్వామి ఆలయం అభివద్ధిలో అందరూ పాత్రులు కావాలని టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్ధసారధి అన్నారు. ఆలయంలో నిత్య కైంకర్యాల తనిఖీ నిమిత్తం బుధవారం ఆయన ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద ఉభయదారులు ఆలయంకు సంబంధించిన పండుగలు, ఉత్సవాల్లో పాల్గొనే సౌకర్యాన్ని టీటీడీ కల్పిస్తోందన్నారు. ఆలయంలో నిశ్చితార్థములు, పెళ్లిళ్లు, అన్నప్రాసన మొదలగు శుభకార్యములు నిర్వహించుకొనుటకు అనుమతిస్తున్నామన్నారు. విందులు మాత్రం ఆలయంలో నిర్వహించరాదన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

వెదురుకుప్పంలో..

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఉపాధ్యాయ వత్తి మహోన్నతమైనదని గణిత ఉపాధ్యాయుడు పుత్తూరు మురళిరెడ్డి అన్నారు. బుధవారం వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానించి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారని, వారు పాఠశాలలోని విద్యార్థులను తీర్చిదిద్దడంలో కృషిచేశారని వారి సేవలు మరువలేనివని కొనియాడారు. పాఠశాలలు పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను సత్కరించారు.

సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో మరొక పాఠశాలకు వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులను ప్రస్తుతం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎంతో నిబద్ధతతో పాఠశాలకు హాజరవుతూ విద్యార్థులకు ఎంతో విలువైన సమాచారాన్ని, పాఠాలను బోధించారని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి వీడ్కోలు నిర్వహించారు.

పెద్దపంజాణి: మండల పరిధిలోని రాజుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఆనందమ్మకు బుధవారం స్థానిక సర్పంచ్ నర్మదా నగేష్ రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మన గ్రామంలోని పాఠశాలలో అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులకు విద్య బుద్ధులు నేర్పిస్తూ పాఠశాల అభివద్ధికి తనవంతు కషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ క్రిష్ణప్ప, ప్రధానోపాధ్యాయులు మహేందర్ రెడ్డి, సిఆర్పి రమేష్, పేరెంట్ కమిటీ చైర్మన్ నగేష్, పేరెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోమలలో...


పెద్దపంజాణిలో..

పేదలకు వరం సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ

ప్రజాశక్తి- పలమనేరు: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని పలువురు బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే తన నివాసం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటే గౌడ మాట్లాడుతూ.. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మంది పేదలకు నాణ్యమైన వైద్యమందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. పలమనేరు నియోజకవర్గ పరిధిలోని పెద్ద వెలగటూరు, దుగ్గినవారిపల్లి, నల్లసానిపల్లి చెందిన నలుగురికి నాలుగు లక్షల పదివేల రూపాయలు చెక్కులను పంపిణీ చేశారు. పలమనేరు రూరల్ కన్వీనర్ బాలాజీ నాయుడు, గంగవరం మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, పెద్ద వెలగటూరు ఎంపీటీసీ మోహన్ రెడ్డి, గంగవరం మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు

బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లి పంచాయతీ ఆకుల కొత్తూరు గ్రామానికి చెందిన అమ్మరమ్మ కుమారుడు హేమగిరికు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో బెంగళూరు పట్టణంలోని మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స నిర్వహించారు. వీరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.3లక్షలు మంజూరు కాగా బుధవారం సర్పంచ్ విసి.వెంకటేష్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణమూర్తి అమరమ్మకు చెక్కును అందజేశారు. వారి వెంట ఎంపీటీసీ భాస్కర్, గంగినాయనపల్లి సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి, క్రిష్ణ రెడ్డి ఉన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'

చైతన్యయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఈనెల 7వ తేదీన తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరగనున్న భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ పలమనేరు పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో చైతన్యయాత్ర రూట్ మ్యాప్‌పై బుధవారం ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్యయాత్ర మాజీ మంత్రివర్యులు అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన పలమనేరు పట్టణంలో ఈ నెల 7న 10 గంటలకు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమై రాత్రి మండలంలోని కొలమాసనపల్లెలో రచ్చబండ అనంతరం పల్లెనిద్రతో కార్యక్రమం పూర్తి అవుతుందన్నారు. అధికార పార్టీ చేస్తున్న మోసాలు, గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను తెలియజేయడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఖాజా పీర్, నాగరాజు, శ్రీధర్, సుధాకర్, చిన్ని, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: బస్సు యాత్రను జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, లోకేష్ ఇచ్చిన సమాచారం మేరకు పూతలపట్టు నియోజకవర్గంలో బస్సుయాత్ర ప్రారంభిస్తామని, గురువారం నియోజకవర్గంలోని ఐరాల మండలంలో యాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, సర్పంచ్ కోక ప్రకాష్ నాయుడు, ఉప సర్పంచ్ లోకనాథం నాయుడు, మాజీ సర్పంచ్ ప్రకాష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పూతలపట్టు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కష్ణకుమారి పాల్గొన్నారు.

నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్‌గా 'సోమరాజు'

ప్రజాశక్తి- పలమనేరు: జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్‌గా సోమరాజును ఎన్నుకున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డివి.మునిరత్నం, వేలాయుధం తెలిపారు. బుధవారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయంలో పార్థసారధి అధ్యక్షతన యూత్ నియోజకవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం యూత్ నూతన కమిటీని గౌరవ అధ్యక్షులుగా మనీ, అధ్యక్షులుగా సోమరాజు, కార్యదర్శి అశోక్, కోశాధికారి హరి, ఉపాధ్యక్షులు చంద్ర, సహాయ కార్యదర్శి శంకర్ ఓ పాటు ఆరు మంది సభ్యులుగా ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ అండరెడ్డిపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలను నిర్మూలించాలన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలకు గ్రామ వాలంటీరు, ఆశ వర్కర్లకు పలు సూచనలు సలహాలు అందించారు. డీఈఎంఓ జయరాం, సబ్‌యూనిట్ అధికారి పీరు సాహెబ్, మండల ఆరోగ్య పర్యవేక్షకులు హరికష్ణ, ఆరోగ్య కార్యకర్త రోజా రమణి, ఎంసిహెచ్‌పి దిలీప్ పాల్గొన్నారు.

'క్లాప్' కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- నగరి:
జిల్లా వ్యాప్తంగా గ్రీన్ అంబాసిడర్లకు (క్లాప్ కార్మికులకు) పెండింగ్‌లో వున్న జీతాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 680 ప్రకారం రూ.10వేలు రూపాయలు జీతం ఇవ్వాలన్నారు. చిత్తూరు జిల్లా గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశం నగరి ఏఐటియుసి కార్యాలయంలో యూనియన్ కార్యదర్శి గోవిందస్వామి అధ్యక్షతన జరిగింది. ఈసందర్బంగా కోదండయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ పనులు చేస్తూ గ్రామ ప్రజలను అనారోగ్యానికి గురి కాకుండా కాపాడుతూ, చెత్తాచెదారం, పారిశుద్ధ పనులు చేస్తున్న కార్మికులకు 20నెలల పెండింగ్ ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవోలకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని అయినా అధికారులు స్పందించలేదని వాపోయారు. జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని వెంటనే పెండింగ్లో ఉన్న 20 నెలలు జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేలన్ శేఖర్, బాషాశేఖర్, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర, ఉపాధ్యక్షులు ఏసుపాదం, కష్ణయ్య, గిరి, మురళి, దేశప్ప పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సంక్రాంతిపల్లె వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకున్నది. సిఐ నాగరాజురావు ఇచ్చిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పుంగునూరు గ్రామానికి చెందిన వినయ్ కుమార్ చిత్తూరుకి వెళ్లి స్వగ్రామానికి వెళుతుండగా ముందర వెళుతున్న లారీని తప్పించబోయి పక్కన వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈసంఘటనలో వినయ్ కుమార్ తలకు తీవ్రగాయాలు కాగా పెద్దపంజాణీ ఎంపిడిఓ శ్రీనివాస విశ్వనాథ వైద్యసాయం చేస్తూ 108 అంబులెన్సులో చిత్తూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వినయ్ కుమార్ మతి చెందినట్లు సిఐ తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాటుసారా కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి- చౌడేపల్లి : నాటు సారా కేసులో ఓవ్యక్తిని రిమాండ్కు తరలించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దిగువపల్లి పంచాయతీ పక్షిరాజుపురం చెందిన సాగర్ జూన్‌నెల 30వ తేదీన నాటు సారా కేసులో ముద్దాయిగా అరెస్టు అయ్యాడు. అతన్ని బుధవారం పుంగనూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.